

రంజాన్ వేళలు

ఇఫ్తార్ - సోమవారం
సాయంత్రం - 6:35

సహర్ - మంగళవారం
ఉదయం - 4:48



- భారీగా పట్టుబడుతున్న నగదు, బంగారం, మద్యం
- ఉల్లంఘనలపై అధికారుల చర్యలు
- 50వేలకుపైగా నగదు తీసుకెళ్తే ఆధారాలు తప్పనిసరి
- రూ.10వేలకు మించి విలువైన కొత్త వస్తువుల తరలింపుపైనా ఆంక్షలు
- ఇప్పటి వరకు రూ.79.41లక్షలు సీజ్

నిరంతర నిఘా

“ త్వరలో జరగనునన్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నగదు, బంగారం, వెండి, ఇతర విలువైన వస్తువుల అక్రమ రవాణాపై పోలీసు శాఖ గట్టి నిఘా ఏర్పాటు చేసింది. ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు పెట్టి పోలీసులు, కేంద్ర బలగాలు తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చింది మొదలు తనిఖీలు కొనసాగుతున్నాయి. ఎన్నికలు పూర్తయ్యే వరకు నగదు, విలువైన వస్తువుల రవాణాపై కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో గట్టి నిఘా కొనసాగుతోంది. రూ.50వేలకు మించి నగదు, లేదా బంగారం, ఇతర విలువైన వస్తువులను తీసుకువెళ్తే వాటికి సంబంధించి ఆధారాలు చూపాల్సి ఉంటుంది. లేదంటే ఎన్నికల వ్యయ నియంత్రణ అధికారులు నగదు/వస్తువులను సీజ్ చేస్తారు. ఆధారాలు చూపిన తర్వాతే వాటిని రిలీజ్ చేస్తారు. భారీ మొత్తంలో నగదు లేదా బంగారం పట్టుబడితే ఆదాయ పన్ను శాఖకు కూడా అప్పగించే అవకాశం ఉంది. ఎన్నికల సమయంలో ప్రజలు నగదు తీసుకువెళ్తే తగిన ఆధారాలను వెంట ఉంచుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, మార్చి 31) : లోక్‌సభ ఎన్నికల్లో వ్యయ నియంత్రణ ప్రధాన అంశంగా మారింది. ప్రతి ఖర్చునూ లెక్కించాల్సి ఉంటుంది. పార్లమెంటరీ ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించేందుకు అక్రమాలు జరగకుండా కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిరంతర నిఘా ఏర్పాటు చేశారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నగదు తరలింపుపై పోలీసులు నిఘాను పటిష్టం చేశారు. జిల్లాలో చాలా చోట్ల ఎన్నికల చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. మరో వైపు ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలను ముమ్మరం చేస్తుంది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా భారీగా నగదు, బంగారం పట్టుబడింది. నగదు, బంగారం, ఇతర విలువైన వస్తువుల రవాణా సమయంలో తగిన ఆధారాలను వెంట ఉంచుకోవాలని అధికారులు ప్రజలకు సూచిస్తున్నారు. ఆధారాలు లేకుండా నగదు, బంగారం తరలిస్తే కేసులు పెట్టే ఆస్కారం ఉందని పేర్కొంటున్నారు. చెక్కు, డీడీ, ఆర్‌టీజీఎస్, ఆన్‌లైన్ పద్ధతుల్లోనే ఖాతాల్లోకి నగదు బదిలీ చేసుకునే వెసులుబాటు ఉంది. అయినా తెలియని కొందరు వారి అవసరాలకు బంగారంతో పాటు డబ్బును వెంట తీసుకెళుతున్నారు. తగిన ఆధారాలతో డబ్బు, బంగారం తీసుకెళితే పరవాలేదు కానీ.. ఆధారాలు లేకుండా నగదు, బంగారం, విలువైన వస్తువులు తరలిస్తే అధికారులకు లెక్కలు చూపించాల్సిందే. ఎన్నికల కోడ్ కారణంగా ఎవరైనా తమ వెంట రూ.50వేలు మాత్రమే తీసుకెళ్లేందుకు అనుమతి ఉంది. అంతకు మించి ఉన్న నగదుకు సంబంధించి ఆధారాలు తప్పక ఉండాలి. సహేతుక ఆధారాలు లేని నగదుపై పోలీసులు, రెవెన్యూ, ఎన్నికల అధికారులు నిశితంగా పరిశీలిస్తారు. సదరు వ్యక్తికి అంత మొత్తం ఎలా సమకూరింది? ఆ మొత్తంతో ఏమి

చెక్‌పోస్టుల వద్ద ముమ్మర తనిఖీలు

చేయబోతున్నారనేది అడిగి తెలుసుకుంటారు. చెప్పిన లెక్కలకు తగిన ఆధారాలు చూపాలి. లేదంటే ఆ నగదును పోలీసులు స్వాధీనం చేసుకుంటారు. పట్టుబడిన నగదు రూ.2లక్షల నుంచి రూ.10లక్షల వరకు ఉంటే.. జిల్లా ఎన్నికల అధికారి నియమించిన కమిటీకి అప్పగిస్తారు. నగదు యజమాని జిల్లా కమిటీ ముందు హాజరై నగదు మూలం, అవసరాలకు సంబంధించి వివరణ ఇవ్వాలి. దీంతో కమిటీ సంతృప్తి చెందితే డబ్బులు తిరిగి ఇచ్చేస్తారు. లేదంటే పోలీసు శాఖకు ఫిర్యాదు చేయడం ద్వారా తదుపరి చర్యలకు ఆదేశిస్తారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు రూ.10లక్షలు దాటితే ఆ విషయాన్ని ఆదాయపు పన్నుశాఖకు నివేదించాలి. నగదు స్వాధీనం చేసుక్ను అధికారులు బాధ్యులకు నోటీసులు జారీ చేస్తారు. వారి సమాధానాన్ని వివిధ కోణాల్లో పరిశీలించిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటారు.



యాచారంలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

కలెక్టరేట్‌లో జిల్లా ఫిర్యాదుల కమిటీ

భారత ఎన్నికల కమిషన్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఎంపీ ఎన్నికలను పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 'జిల్లా ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ భారత ఎన్నికల సంఘం స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ప్రకారం జప్తు చేసిన నగదు, ఇతర వస్తువుల విడుదలకు పనిచేస్తుంది. ఈ జిల్లా ఫిర్యాదుల కమిటీ చైర్మన్‌గా జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత, కన్వీనర్‌గా జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌మోహన్, సభ్యులుగా డీటీవో వెంకట్‌రెడ్డి ఉన్నారు. ఫిర్యాదు దారులు జప్తు చేసిన నగదు, ఇతర వస్తువులు విడుదలకు సంబంధిత వివరాలతో, పత్రాలతో జిల్లా ఫిర్యాదుల కమిటీని సంప్రదించాలి.

తనిఖీల్లో రూ.79.41లక్షలు సీజ్

ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే డబ్బు, మద్యం, కానుకలు, మత్తు పదార్థాలు తదితర వాటిపై ప్రత్యేక నిఘాపెట్టి గుర్తించిన వారిపై కేసులు నమోదు చేసి వాటిని స్వాధీనం చేసుకుంటున్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వెయలెన్స్, స్టాటిస్టికల్ సర్వెయలెన్స్ బృందాలు, పనిచేస్తున్నాయి. జిల్లాలో ఎన్నికల కోడ్ వెలువడినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎన్నికల ఎన్ఫోర్స్‌మెంట్ బృందాల ద్వారా రూ.79,41,650, రూ.4,18,700 విలువైన 5.3కిలోల వెండి, రూ.37,53,050 విలువ గల 5,823లీటర్ల మద్యం, రూ.3,03,25,575విలువ గల 717కిలోల డ్రగ్స్/నార్కొటిక్స్‌ను సీజ్ చేశారు. అబ్కారీ, రవాణా, వాణిజ్య పన్నులు తదితర శాఖల సిబ్బంది ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. రూ.10లక్షలకుపైగా డబ్బు పట్టుబడిన సందర్భాల్లో ఆదాయ పన్ను శాఖ అధికారులకు సమాచారమందిస్తున్నారు. బ్యాంకు లావాదేవీలపై ఎన్నికల సంఘానికి రోజూ నివేదిక అందజేస్తున్నారు. అక్రమ మద్యం నిల్వలు, మద్యం రవాణాపై దాడులు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల విధంగానే ఈ ఎన్నికల్లోనూ అధికారులు సమష్టిగా కృషిచేస్తూ అక్రమంగా రవానా అయ్యే డబ్బు, మద్యం, కానుకలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు.



విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

వేద పాఠశాల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

షాద్‌నగర్ రూరల్, మార్చి 31: వేద పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం కిషన్‌నగర్ శివారులో ఉన్న వేద పాఠశాలకు వచ్చిన కాశీ జగద్గురు చంద్రశేఖర శివాచార్య స్వామిని ఆదివారం ఎమ్మెల్యే కలిసి ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. షాద్‌నగర్‌లో వేదపాఠశాల ఏర్పాటు చేయడం గొప్ప విషయం అన్నారు. ఇక్కడ ఆధ్యాత్మిక వాతావరణానికి వేద పాఠశాల ఎంతో ఉపకరిస్తుందని, స్థానిక విద్యార్థులు వేదాలు, పురోహిత పాఠాలు నేర్చుకునే అవకాశం కలిగిందన్నారు. పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారం అందజేస్తానన్నారు. అనంతరం దాత సురేష్‌కుమార్ సహకారంతో విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు కాశీనాథ్, కౌన్సిలర్లు విశ్వం, విశాల, నాయకులు చెన్నయ్య, తిరుపతిరెడ్డి, బసవేశ్వర్, నందు, రాఘవేందర్ పాల్గొన్నారు.



చిప్పలపల్లిలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

సజావుగా ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

కందుకూరు, మార్చి 31 : లోక్‌సభ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ప్రతీ ఒక్కరు సహకరించాలని,శాంతి భద్రతలకు భంగం కల్గించొద్దని కందుకూరు సీఐ మక్బుల్‌జానీ అన్నారు. ఆదివారం నేదునూరు, బాచుపల్లి, పులిమామిడి, దన్నారం, చిప్పలపల్లి గ్రామాల్లో ఎస్సై సైదులు, సీఐఎస్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణలతో కలిసి కవాతు నిర్వహించారు. గ్రామాల్లో ఎలాంటి అల్లర్లు జరిగినా వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలని ప్రజలను కోరారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా సహకరించాలని, అరాచక శక్తులతో అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో కేంద్ర బలగాలు, పోలీసులు పాల్గొన్నారు.

దేవుని పడకల్‌లో బండలాగుడు పోటీలు

- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల నుంచి ఎద్దులతో రాక

తలకొండపల్లి, మార్చి 31 : దేవుని పడకల్ గ్రామంలో ఆదివారం అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలను అట్టహాసంగా నిర్వహించారు. వేంకటేశ్వరాలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శతాబ్ది టౌన్షిప్ ఎండీ కాసు శ్రీనివాస్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి, షాద్‌నగర్‌కు చెందిన బి.సంజీవరెడ్డి, ఎస్.ఆర్ డెవెలపర్స్ సహకారంతో పోటీలు నిర్వహించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి పలువురు ఎడ్లతో పోటీల్లో పాల్గొన్నారు. పోటీలను చూసేందుకు సమీప గ్రామాల ప్రజలు తరలి వచ్చారు. ఎస్ఐ శ్రీకాంత్, మాజీ సర్పంచ్ శ్రీశైలం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి పోటీలను ప్రారంభించారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు పోటీలు కొనసాగాయి. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి



బండలాగుతున్న ఎడ్లు

రూ.1.16లక్షలు, ద్వితీయ బహుమతి రూ.80,116 కాసు శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో, తృతీయ బహుమతి రూ.70,116 ప్రభాకర్‌రెడ్డి, నాల్గో బహుమతి రూ.50,116 ఎస్.ఆర్ డెవలపర్స్ వారు అందజేశారు. కడ్తాల శ్రీకాంత్ ఆధ్వర్యంలో తాగునీటి, ఇతర వసతులు ఏర్పాటు చేశారు. కార్య క్రమంలో ధర్మకర్త లట్టుపల్లి రాజ్‌కుమార్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ కేశవరెడ్డి, నాయకులు సత్యం, శంకర్, శ్రీను, వెంకటేశ్, అశోక్, మల్లేశ్, శ్యామ్‌సుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు

తలకొండపల్లి, మార్చి 31 : చీపునుంతలలో నిర్మించిన శివసీతా రామాంజనేయ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, శివ, నంది, సీతారామలక్ష్మణ, ఆంజనేయస్వామి ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. అర్చకులు శ్రీనివాసశర్మ, నర్సింహ, రాజుశర్మల ఆధ్వర్యంలో ఆదివారం రుద్రాభిషేకం, హోమం, జలాధివాసం, ధాన్యాదివాస పూజలు నిర్వహించారు. సోమవారం నిర్వహించే విగ్రహ ప్రతిష్ఠ వేడుకలకు ఏర్పాట్లు చేశారు. వేడుకల్లో స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



హోమంలో పాల్గొన్న భక్తులు



ఘనంగా ఈస్టర్ వేడుకలు

మరియాపురం చర్చిలో కేక్ కట్‌చేస్తున్న ఫాదర్లు

ఈస్టర్ క్రైస్తవులకు అతిపెద్ద పండుగ. క్రీస్తు పరమపదించిన మూడో రోజు అనగా ప్రతీ గుడ్ ఫ్రైడే తరువాత వచ్చే ఆదివారం ఈస్టర్ వేడుక నిర్వహిస్తారు. క్రీస్తు పునరుత్థాన రోజుగా క్రైస్తవులు ఈస్టర్‌ను జరుపుకుంటారు. ఆదివారం మండలంలో మరియాపురం, కేశవగూడ, షాబాద్, బోనగిరిపల్లి, మద్దూర్ గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వేడుకల్లో ఆయా చర్చిల ఫాదర్లు, పాస్టర్లు, భారీ సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

- షాబాద్, మార్చి 31

భానుడి ఉగ్రరూపం.. తల్లడిల్లుతున్న జనం

- 40 డిగ్రీలు దాటిన పగటి ఉష్ణోగ్రతలు
- రోడ్లపైకి వచ్చేందుకు జంకుతున్న ప్రజలు



పండ్ల రసాలు తాగుతున్న బాటసారులు

ఆమనగల్లు, మార్చి 31 : సూర్యుడు తన ప్రకోపాన్ని చూపుతున్నాడు. మండుతున్న ఎండలతో జనం అల్లాడుతున్నారు. రోడ్లపైకి వచ్చేందుకు జంకుతున్నారు. చూస్తుండగానే ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు పైగానే నమోదువుతున్నాయి. ఎండలతో వృద్ధులు, పిల్లలు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఉదయం 11 గంటలు మొదలు సాయంత్రం 4:30గంటల వరకు ఎండ తీవ్రత తగ్గడం లేదు. ఎండ తీవ్రతతో ఉపాధి కూలీలు పనులకు వెళ్లేందుకు భయపడుతున్నారు. వడదెబ్బ సోకి సొమ్మసిల్లే ప్రమాదం ఉంది. వయసు మళ్లిన వారు ఎండలకు లోబీపీకి, డీహైడ్రేషన్‌కు గురై ప్రాణాలకు ముప్పు పొంచి ఉంది. ఎండల భయానికి ప్రజలు ఉదయం, సాయంత్రం వేళల్లోనే ప్రయాణాలు సాగిస్తున్నారు. వృద్ధులు, పిల్లలు ఎండలు తట్టుకోలేక అస్వస్థతకు గురవుతున్నారు. ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. రద్దీగా ఉండే శ్రీశైలం-హైదరాబాద్ రహదారి మధ్యాహ్నం కర్ఫ్యూను తలపిస్తోంది. మధ్యాహ్న సమయంలో రోడ్డుపై జనం కన్పించడం లేదు. శుభకార్యాలు, పెళ్లిళ్లకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఎండల ప్రభావంతో గిరాకీలు తగ్గి దుకాణదారులు నష్టపోతున్నారు. ఇదిలా ఉంటే మండుతున్న ఎండలు మాత్రం సీజనల్ వ్యాపారులకు కలిసొచ్చింది. దాహాన్ని తీర్చుకునేందుకు ప్రజలు పండ్లు, పండ్ల రసాలు, శీతల పానీయాలు, కొబ్బరి బోండాలు, చెరకు రసం, ఐస్‌క్రీమ్ దుకాణాల వైపు పరుగెడుతున్నారు. ఆమనగల్లులో సీజనల్ వ్యాపారాలతో వందల మంది ఉపాధి పొందుతున్నారు. కుండల అమ్మకాలు జోరందుకున్నాయి. ఫ్యాన్లు, ఏసీలు, కూలర్ల విక్రయాలు కూడా పెరిగాయి. ఏప్రిల్, మే నెలల్లో పూర్తిగా.. జూన్‌లో కనీసం 15 రోజులు ఎండల తీవ్రత ఉండనుంది. అందుకు అనుగుణంగా ప్రజలు తమ రోజువారీ పనులు చేసుకోవాలని, ఎండ తీవ్రత పెరగక ముందు అంటే ఉదయం 11లోపు అలాగే.. సాయంత్రం నాలుగున్నర తర్వాతే బయటి పనులు పెట్టుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఎండల్లో అత్యవసరంగా బయటకు వెళ్లాల్సి వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, లిక్విడ్లు, నీరు ఎక్కువ సేవించాలని సూచిస్తున్నారు. పాడైన, నిల్వ ఉన్న ఆహారాన్ని తినొద్దని, కలుషిత ఆహారం తీసుకుంటే ఎండకాలం అతిసార వ్యాధిబారిన పడతారని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

వన్యప్రాణుల దాహార్తి తీరుస్తున్న అటవీ అధికారులు

యాచారం : ఎండల ప్రభావంతో మనుషులతో మూగజీవాలూ దూపతో అలమటిస్తున్నాయి. చెరువులు, కుంటలెండి పశువులకు నీరు లభించడం లేదు. యాచారం మండలం తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాల పరిధిలో 20వేల ఎకరాల్లో అడవి ఉంది. అలాగే గున్గల్, గడ్డమల్లయ్యగూడ, మంతన్‌గౌరెల్లి పరిధిలో 10వేల ఎకరాల అటవీ ప్రాంతం ఉంది. ఈ అడవుల్లో నెమళ్లు, కుందేళ్లు, 400 వరకు జింకలు, అడవి పందులు, హైనాలు, నక్కలు, పక్షులు తదితర జీవులకు కొదవలేదు. వన్యప్రాణులు దప్పికతో అలమటించకుండా జిల్లా అటవీశాఖ అధికారులు ఆయా అటవీ ప్రాంతాల్లో గుంతలు, పదుల సంఖ్యలో సాసర్ పిట్‌లు నిర్మించారు. తాటిపర్తి తాటికుంట మైసమ్మ ఆలయం పక్కన ఉన్న కుంటలో నీరుండడంతో నక్కలు, హైనాలు, జింకలు, కుందేళ్లు, పక్షులు దప్పిక తీర్చుకుంటున్నాయి. అడవుల్లో ఆహారం దొరక్క కోతులు గ్రామాల్లో సంచరిస్తున్నాయి. పంటలను, ఇండ్లను పాడు చేస్తున్నాయి. గడ్డమల్లయ్యగూడలో అడవికి సమీప పొలాలను జింకలు పాడుచేస్తున్నాయి. కొత్తిమీర, పాలకూర, మెంతెంకూర, వంకాయ, టమాట, బీరకాయ, సొరకాయలను తిని పాడు చేస్తున్నాయి.



తాటిపర్తి అడవిలోని సాసర్ పిట్‌లో నీరు నింపుతున్న అటవీ శాఖ సిబ్బంది



ఎండ తీవ్రతతో ఆమనగల్లులో నిర్మానుష్యంగా మారిన శ్రీశైలం-హైదరాబాద్ రహదారి

జింకలు పొలాలను పాడు చేస్తున్నాయి



ఎండలు ముదరడంతో జింకలు తాళలేక మేతకు పొలాల్లోకి వస్తున్నాయి. ఆకుకూరలు తిని పాడుచేస్తున్నాయి. అడవుల్లోని సాసర్ పిట్లలో అటవీ శాఖ సిబ్బంది పోస్తున్న నీరు ఒక్క రోజులోనే ఆవిరైపోతుండడంతో వన్యప్రాణులకు నీరు దొరకడం లేదు. దీంతో అవి పొలాల్లోకి వస్తున్నాయి. రెండుమూడు రోజులకోసారైనా అన్ని సాసర్ పిట్లలో నీరు పోయాలి.

- అచ్చన జంగయ్య, మాజీ సర్పంచ్

కోడ్ ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయాలి

● మేడ్చల్ జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్

మేడ్చల్ మార్చి 31(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో అక్రమాలు, ఉల్లంఘనలపై ఫిర్యాదుకు సి-విజిల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని ఎన్నికల అధికారి కలెక్టర్ గౌతమ్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డబ్బు పంపకాలు, ఉచితాలు, ఓటర్లను ప్రలోభ పెట్టినా, మద్యం సరఫరా చేసినా, నేర పూరిత చర్యలతో భయభ్రాంతులకు గురిచేసినా, లెక్కకు మించిన ఖర్చు చేసినా, మతపరమైన ప్రసంగాలు చేసినా, ఫిర్యాదులు తాజాగా ఫొటోలు తీసి, వీడియోలు, ఆడియో రికార్డ్ ద్వారా యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. 100 నిమిషాల లోపే ఉల్లంఘనపై చర్యలు తీసుకుంటామన్నారు. సి-విజిల్ యాప్‌లో అప్‌లోడ్ చేసిన ఫిర్యాదులు ఐదు నిమిషాల్లోపు జిల్లా ఎన్నికల అధికారి నియంత్రణలో గల మానిటరింగ్ సెల్‌కు తెలుస్తుందని, తదుపరి ఐదు నిముషాల్లోపు క్షేత్రపరిశీలన అధికారి అయిన ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ బృందం విచారణ నిమిత్తం పంపబడుతుందన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీం 15నిమిషాల్లో ఫిర్యాదులో తెలిపిన స్థలానికి చేరుకుని, క్షేత్ర విచారణ జరిపి 30నిమిషాల్లో వివరాలు సేకరించి నివేదికను సంబంధిత రిటర్నింగ్ అధికారికి అందజేస్తారన్నారు. దానిపై రిటర్నింగ్ అధికారి 50నిమిషాల్లో నివేదికను పరిశీలించి ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఫిర్యాదు చేసిన వారి పేర్లను, సెల్ నంబర్‌ను గోప్యంగా ఉంచనున్నట్లు తెలిపారు. సి-విజిల్‌లో ఫిర్యాదు చేసే వ్యక్తులు పక్కా ఆధారాలతో ఫిర్యాదులు చేయాలన్నారు. తీరా ఆప్రదేశానికి చేరుకునే లోపు ఆధారాలు లేకుండా ఉండటంతో సమయం వృథా అవుతుందన్నారు. ఇప్పటి వరకు సివిజిల్ యాప్ ద్వారా 13కేసులు పరిష్కరించనున్నట్లు తెలిపారు.


కలెక్టర్ గౌతమ్

ఉచితంగా డీఎస్సీ కోచింగ్ ఇవ్వాలి

● సీపీఐ వికారాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య

బొంరాస్‌పేట్, మార్చి 31: డీఎస్సీ పరీక్షకు నిరుపేద నిరుద్యోగులకు ఉచితంగా కోచింగ్ సెంటర్‌లను ఏర్పాటు చేయాలని సీపీఐ వికారాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి ఉపాధ్యాయ, ఉద్యోగాలను భర్తీ చేయడం హర్షనీయమన్నారు. సీఎం సొంత నియోజకవర్గ కేంద్రం కొడంగల్‌లో పేద కుటుంబాల నిరుద్యోగులు ఉన్నారని వీరందరూ డీఎస్సీ పరీక్షకు సమాయత్తం అవుతున్నారన్నారు. ఉచిత కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తే నిరుద్యోగులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.

ధ్యానంతో ఆరోగ్యవంతమైన జీవితం

కులకచర్ల, మార్చి 31: రోజూ ధ్యానం చేయడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితం లభిస్తుందని పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శి బంగ్లా ఆంజనేయరెడ్డి తెలిపారు. మండలంలోని చాపలగూడెం, తిరుమలపూర్, ఇప్పాయిపల్లి, రాంపూర్ గ్రామాల్లో ఆదివారం ప్రజలకు ధ్యానంపై అవగాహన కల్పించారు. నిత్య జీవితంలో ఎదుర్కొనే మానసిక ఒత్తిడి నుంచి బయటపడతామని ఆయన తెలిపారు. తలనొప్పి నుంచి క్యాన్సర్ లాంటి ప్రమాదకర జబ్బులు ధ్యానం ద్వారా తగ్గుతాయన్నారు. నాడీ మండల శుద్ధి జరిగి రోగనిరోధక శక్తి పెరిగేందుకు ధ్యానం దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పిరమిడ్‌సంస్థ సభ్యులు యాదయ్య, తిరుపతయ్య, బాలకృష్ణారెడ్డి, శైలజ, శోభిత, వెంకటేశ్, శ్రీనివాస్, పూజ, ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ 'రెండో దశ'తో ఒప్పందానికి నో!

2400 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణం.. కరెంటు కొనుగోలుకు సర్కారు విముఖత

- విద్యుత్తు వచ్చేది 5-8 ఏళ్ల తర్వాతే!
- అప్పటికి రూ.8-9 మధ్య యూనిట్ ధర
- ఒప్పందం చేసుకుంటే రాష్ట్రానికి గుదిబండే!



హైదరాబాద్ మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రామగుండంలో ఎన్టీపీసీ ఆధ్వర్యంలో నిర్మించతలపెట్టిన రెండో విడత తెలంగాణ సూపర్ థర్మల్ విద్యుత్తు కేంద్రం నుంచి కరెంటు కొనుగోలు చేస్తే రాష్ట్రానికి పెనుభారంగా మారే ప్రమాదం ఉందని ప్రభుత్వం అంచనా వేసింది. 2400 మెగావాట్ల సామర్థ్యంతో తలపెట్టిన ఈ విద్యుత్కేంద్రం నిర్మాణానికి ఐదు నుంచి ఎనిమిదేళ్లు పడుతుందని.. అప్పటికి ఇక్కడి నుంచి ఉత్పత్తయ్యే విద్యుత్తు ధర యూనిట్‌కు రూ.8-9కి ఎగబాకుతుందని రాష్ట్ర ఇంధన శాఖ అంచనాకు వచ్చింది. బహిరంగ మార్కెట్లో ఇంతకంటే తక్కువ ధరకే విద్యుత్తు లభిస్తుండగా, భారీ ధరతో 25 ఏళ్ల పాటు కరెంటు కొనుగోలుకు దీర్ఘకాలిక ఒప్పందం చేసుకుంటే రాష్ట్ర ప్రజలపై రూ.వేల కోట్ల అనవసర భారం పడుతుందని తేల్చింది. ఈ నేపథ్యంలో ఎన్టీపీసీతో ఎలాంటి విద్యుత్తు కొనుగోలు ఒప్పందం చేసుకోరాదని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయానికి వచ్చింది. త్వరగా ఒప్పందం చేసుకోకపోతే ఇతర రాష్ట్రాలతో అగ్రిమెంట్ చేసుకుని విద్యుత్కేంద్రం నిర్మిస్తామని ఎన్టీపీసీ ఇటీవల అల్టిమేటం జారీ చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ వ్యవహారంపై సమీక్షించి, కొనుగోలు ఒప్పందం చేసుకోరాదని నిర్ణయించింది. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణలో విద్యుత్తు కొరతను తీర్చడానికి ఎన్టీపీసీ ఆధ్వర్యంలో 4000 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని పునర్విభజన చట్టం-2014లో కేంద్రం హామీ ఇవ్వగా, తొలి విడత కింద 1600 మెగావాట్ల విద్యుత్కేంద్రం నిర్మాణాన్ని ఇటీవల ఎన్టీపీసీ పూర్తి చేసింది. రెండో విడత కింద 2400 మెగావాట్ల ప్లాంట్లను నిర్మించాల్సి ఉంది. తొలి విడత విద్యుత్తు ధర యూనిట్‌కు రూ.5.90 ఉండగా, ఒప్పందం కారణంగా కొనుగోలు చేయక తప్పని పరిస్థితి ఉంది.

గత సర్కారు తప్పిదమే..!

పదేళ్లలో గత ప్రభుత్వం చేసిన పాపాలు రాష్ట్రంలో విద్యుత్తు సంస్థలకు గుదిబండగా మారాయని కాంగ్రెస్ సర్కారు ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. రెండో విడతలో 2400 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణానికి ఎన్టీపీసీతో ఒప్పందం చేసుకోకుండా 10 ఏళ్లపాటు జాప్యం చేయడమే దీనికి కారణమని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అప్పట్లో ఒప్పందం చేసుకొని ఉంటే ఇప్పటికే నిర్మాణం పూర్తయి, తక్కువ ధరకు రాష్ట్రానికి కరెంటు వచ్చేదని చెబుతున్నాయి. ఇప్పుడు ఒప్పందం చేసుకుంటే భవిష్యత్తులో రాష్ట్రానికి గుదిబండగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

కొత్త థర్మల్ ప్లాంట్లకు స్వస్తి..

దామరచర్లలో తెలంగాణ జెన్‌కో నిర్మిస్తున్న 4000 మెగావాట్ల యాదాద్రి థర్మల్ విద్యుత్కేంద్రం నాలుగేళ్ల కిందే పూర్తి కావాల్సి ఉండగా, ఇంకా పనులు సాగుతున్నాయి. జాప్యంతో ప్రాజెక్టు నిర్మాణ వ్యయం పెరిగింది. కాలం చెల్లిన సబ్‌క్రిటికల్ టెక్నాలజీతో నిర్మించిన భద్రాద్రి విద్యుత్తు కేంద్రం వ్యయం సైతం భారీగా పెరగడంతో దాని విద్యుత్తు ధరలూ పెరిగిపోయాయి. యాదాద్రి, భద్రాద్రి ప్లాంట్ల నిర్మాణంలో తీవ్ర అవినీతి ఆరోపణలు రావడంతో కాంగ్రెస్ సర్కారు న్యాయ విచారణకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో మళ్లీ కొత్త థర్మల్ విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణం జోలికి వెళ్లవద్దని ప్రభుత్వం ఓ అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. ప్రత్యామ్నాయంగా మార్కెట్‌లో రూ.2-4కు యూనిట్ చొప్పున లభిస్తున్న పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని పెంచుకోవాలని నిర్ణయించింది. సౌర, జల, పవన, పంప్డ్ స్టోరేజీ, బ్యాటరీ స్టోరేజ్ విద్యుత్తుపై దృష్టిపెట్టాలని నిర్ణయించింది.

బాసర ఆలయంలో విజిలెన్స్ తనిఖీలు

(మొదటిపేజీ తరువాయి)

సెంట్రల్ స్టోర్‌లో ఉన్న సరుకులను పరిశీలించారు. సరుకుల నాణ్యత, బ్రాండ్‌లు రికార్డుల్లో పేర్కొన్న ప్రకారం ఉన్నాయో లేదో సరి చూశారు. టెండరులో ఉన్న బ్రాండ్‌లు, క్వాలిటీ కాకుండా ఇతర సరుకులు ఉన్నట్లు, రికార్డుల్లో ఉన్న సరుకులకు, స్టోర్ రూమ్‌లో ఉన్న సరుకుల లెక్కలకు తేడాలు ఉన్నట్లు గుర్తించారు. అనంతరం ఆలయ కార్యాలయంలో దాదాపు 5 గంటల పాటు రికార్డులను పరిశీలించారు. సరుకుల కొనుగోళ్లకు సంబంధించిన ప్రతీ బిల్లును తనిఖీ చేశారు. జాబితాలో దాదాపు 70 శాతానికి పైగా సరుకుల ధరలు మార్కెట్ రేటు కంటే ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. ఈ విషయంలో ఆలయ అధికారులపై విజిలెన్స్ అధికారి అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఎంఆర్‌పీ కూడా చూడకుండా టెండరును ఎలా నిర్ధారణ చేస్తారని అధికారులను ప్రశ్నించారు. విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా రావడంతో ఆలయ ఈవో హైదరాబాద్ నుంచి హుటాహుటిన బాసర వచ్చారు. కాగా, విజిలెన్స్ అధికారుల ఇచ్చే నివేదిక ఆధారంగా దేవాదాయ శాఖ చర్యలు తీసుకుంటుంది.

పంట నష్టం పరిహారమేదీ?

ఏడాదిగా ఎదురుచూస్తున్న రైతన్నలు.. గతేడాది మార్చి, ఏప్రిల్‌లో 1,51,545 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు

- ఎకరాకు రూ.10 వేల పరిహారం ఇస్తామన్న గత ప్రభుత్వం
- నేటికీ అందని రెండో విడత పంట నష్టపరిహారం
- కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఇవ్వాలని రైతుల వేడుకోలు



జగిత్యాల జిల్లా మోరపల్లిలో నేలవాలిన మొక్కజొన్న (ఫైల్)

జనగామ/జగిత్యాల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలు ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటలు అకాలవర్షానికి నేలపాలయ్యాయి. వడగళ్ల వానలు, ఈదురుగాలులు పంటలను అతలాకుతలం చేశాయి. రైతన్న వేదనను చూసిన ప్రభుత్వం.. వారికి పంట నష్టపరిహారం ఇచ్చి ఆదుకుంటామని హామీ ఇచ్చింది. నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.10 వేల చొప్పున ఇస్తామని చెప్పింది. కానీ, ఏడాది కాలం గడిచిపోతున్నా.. ఇప్పటికీ రైతులకు పరిహారం అందలేదు. ఇంకా వారికి ఎదురుచూపు తప్పలేదు. గతేడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో కురిసిన అకాల వర్షాలకు రాష్ట్రవ్యాప్తంగా అధిక విస్తీర్ణంలో వరి, మామిడి, మొక్కజొన్న తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. కోత దశకు వచ్చిన పంట కావడంతో వడగళ్ల దెబ్బకు గింజలన్నీ నేలరాలి రైతులకు కడగళ్లను మిగిల్చాయి. అధికారుల ద్వారా పంట నష్టం వివరాలను తెప్పించుకున్న నాటి ప్రభుత్వం.. నష్టపోయిన రైతులందరికీ పరిహారం చెల్లిస్తామని చెప్పినా.. కేవలం మార్చి నెలకు సంబంధించిన పరిహారాన్ని మాత్రమే రైతుల ఖాతాల్లో జమ చేసింది. అయితే మార్చి నెలలో జరిగిన నష్టం కన్నా ఏప్రిల్‌లో రెట్టింపు నష్టం సంభవించింది. కానీ, ఏప్రిల్‌లో జరిగిన నష్టానికి సంబంధించిన పరిహారాన్ని మాత్రం రైతులకు నేటికీ ఇవ్వలేదు. ఇందుకోసం రూ.151.54 కోట్లు విడుదల చేస్తున్నట్లు ఆనాడు ప్రకటించినా రైతుల ఖాతాల్లో మాత్రం జమ కాలేదు.

రెండు లక్షల ఎకరాల్లో పంట నష్టం..

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.28 లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందన్న విషయాన్ని నాడు ఖమ్మం జిల్లాలో పంటల పరిశీలన సందర్భంగా అప్పటి సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఇందులో మొక్కజొన్న 1,29,446 ఎకరాలు, వరి 72,709 ఎకరాలు, మామిడి 8,865 ఎకరాల్లో నష్టపోయిందని పేర్కొన్నారు. గతేడాది మార్చి 23న ఖమ్మం, వరంగల్, మహబూబాబాద్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో కేసీఆర్ పర్యటించి నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా పంటనష్టం జరిగిన 26 జిల్లాల్లో వ్యవసాయాధికారులు సర్వే నిర్వహించి 1,51,545 ఎకరాల్లో నష్టం జరిగినట్లు తేల్చారు. దీనికి సంబంధించి ఎకరానికి రూ.10 వేల చొప్పున రూ.151.54 కోట్లు విడుదల చేస్తున్నట్లు గతేడాది జూన్‌లో కేసీఆర్ సర్కారు ప్రకటించింది. మొత్తం 1,30,988 మంది రైతులు పరిహారానికి అర్హులుగా పేర్కొంది. అయితే మార్చి నెల పరిహారాన్ని మాత్రమే రైతుల ఖాతాల్లో జమ చేసింది. కాగా, జగిత్యాల జిల్లాలో గతేడాది మార్చి, ఏప్రిల్‌తోపాటు జూలైనూ కలిపి 73,686 ఎకరాల్లో వివిధ పంటలు దెబ్బతిన్నాయి. ఇందులో మార్చిలోనే 6,199 ఎకరాల్లో పంటలు దెబ్బతినగా.. కేవలం 532 ఎకరాలకే పరిహారం చెల్లించారు. ఏప్రిల్‌లో 52 వేల ఎకరాల్లో, జూలైలో భారీ వర్షాలకు 15,487 ఎకరాల్లో పంటనష్టం వాటిల్లగా.. ఇప్పటివరకు పరిహారం ఇవ్వలేదు. మొత్తంగా రెండో విడతకు సంబంధించి 20,160 మంది రైతులకు పరిహారం కింద రూ.36.69 కోట్లు చెల్లించాల్సి ఉంది.

ఆర్థిక శాఖలో పెండింగ్..

రెండో విడత పంట నష్టం పరిహారానికి సంబంధించిన నిధులు ఆర్థికశాఖ వద్ద పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వంలో 2 విడతలకు సంబంధించి రూ.151.54 కోట్లు విడుదల చేయగా వాటికి ఫైనాన్స్ క్లియరెన్స్ లభించలేదని అధికారులు చెబుతున్నారు. క్లియరెన్స్ వస్తే నేరుగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యే అవకాశముంది. దీనిపై కొత్త ప్రభుత్వం దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

ఏడు ఎకరాల్లో పంట నష్టపోయాను



గతేడాది యాసంగిలో ఏడెకరాల్లో వరి పంట సాగు చేస్తే వడగళ్లు, ఈదురుగాలుల కారణంగా పంటంతా నాశనమైంది. చేతికొచ్చిన గింజలన్నీ చేలోనే రాలిపోయి ఏమీ చేతికిరాలేదు. పంట సాగుకు పెట్టిన పెట్టుబడి కూడా రాలేదు. అధికారులు సర్వే చేసి పంట నష్ట పరిహారం అందిస్తామని చెప్పారు. కానీ, ఏడాది దాటుతున్నా ఒక్క పైసా పరిహారం రాలేదు. అధికారులను అడిగితే ప్రభుత్వం వద్దే పైసలు ఆగిపోయాయని చెబుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పరిహారాన్ని అందించాలి.

- గొడ్డేటి రాజు, గానుగుపహాడ్, జనగామ జిల్లా

రేపు తిరుమలలో వీఐపీ బ్రేక్ దర్శనం రద్దు

తిరుమల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో మంగళవారం శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ నెల తొమ్మిదో తేదీన ఉగాది ఆస్థానం సందర్భంగా మంగళవారం శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం (ఆలయ శుద్ధి) నిర్వహించనున్నారు. ఉదయం 6 నుంచి 11 గంటల వరకు ఈ కార్యక్రమం జరగనుండటంతో వీఐపీ బ్రేక్‌ను టీటీడీ రద్దు చేసింది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఇప్పటికే ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను రద్దు చేసిన విషయం తెలిసిందే. ప్రొటోకాల్ పరిధిలో స్వయంగా వచ్చే వీఐపీలకు, ట్రస్టు దాతలకు మాత్రమే బ్రేక్ దర్శన టికెట్లను జారీ చేస్తున్నారు. కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నేపథ్యంలో వీటిని కూడా రద్దు చేస్తున్నట్టు టీటీడీ తెలిపింది. కాగా, ఎన్నికల కోడ్ నేపథ్యంలో తిరుమల శ్రీవారి శ్రీవాణి ట్రస్టుకు గడిచిన 15 రోజుల్లో రూ.22.75 కోట్ల విరాళాలు అందాయి. ఎన్నికల కోడ్ కారణంగా మార్చి 16వ తేదీ నుంచి వీఐపీ బ్రేక్ సిఫారసు లేఖలను టీటీడీ రద్దు చేసింది. ఈ క్రమంలో శ్రీవాణి ట్రస్టుకు రూ.10వేల విరాళం అందించి రూ.500 బ్రేక్ దర్శన టికెట్లను కొనుగోలు చేసే వారి సంఖ్య పెరిగింది.

బెంగాల్‌లో తుఫాను బీభత్సం

- నలుగురి మృతి, 200 మందికి గాయాలు

కలకత్తా, మార్చి 31: పశ్చిమ బెంగాల్‌లోని జల్పాయిగురి జిల్లాలో ఈదురుగాలులతో కూడిన భారీ తుపాను కారణంగా పలు ఇళ్లు ధ్వంసమయ్యాయి. చెట్లు, హోర్డింగులు, కరెంటు స్తంభాలు నేల కూలాయి. పలు వాహనాలు తిరగబడ్డాయి. దాంతో నలుగురు మృతి చెందగా, 200 మందికిపైగా గాయపడ్డారు. మృతి చెందిన వారికి పశ్చిమ బెంగాల్ సీఎం మమత సానుభూతి తెలిపారు. వారి కుటుంబసభ్యులకు తగిన పరిహారం అందజేస్తామని ప్రకటించారు. గాయపడిన వారికి ప్రభుత్వమే చికిత్స అందిస్తుందని హామీ ఇచ్చారు. కల్లోలిత ప్రాంతాల్లో తగిన రక్షణ చర్యలు చేపట్టవలసిందిగా అధికారులను ఆదేశించారు. బెంగాల్ వరదల్లో మరణించిన వారికి ప్రధాని మోదీ సానుభూతి ప్రకటించారు.

జగన్ నిర్వాకంతో ఏపీ ఖజానా ఖాళీ

అప్పు తీసుకోకపోతే పూటైనా గడవదు... పింఛన్లు ఇవ్వడానికి డబ్బు లేక టీడీపీపై నెపం మోపే యత్నం: చంద్రబాబు

- మార్కాపురం, ఎమ్మిగనూరు, బాపట్లల్లో భారీ బహిరంగ సభలు



బాపట్ల/కర్నూలు/ఒంగోలు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ నిర్వాకంతో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయి ఖజానా ఖాళీ అయిందని టీడీపీ అధినేత చంద్రబాబు విమర్శించారు. అప్పు తీసుకోకపోతే పూటగడవని స్థితికి ప్రభుత్వం చేరుకుందన్నారు. ప్రస్తుతం పింఛన్లు ఇవ్వడానికి కూడా డబ్బులేక.. ఆ నెపం టీడీపీపై మోపే ప్రయత్నం చేస్తున్నాడని ధ్వజమెత్తారు. ప్రజాగళం యాత్రలో భాగంగా ఆదివారం ఆయన ప్రకాశం జిల్లా మార్కాపురం, కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు, బాపట్ల జిల్లా కేంద్రంలో జరిగిన భారీ బహిరంగ సభల్లో ప్రసంగించారు. జగన్ ఈ ఐదేళ్లలో రూ.13 లక్షల కోట్ల అప్పు చేశాడని, వాటిని ఆయన రోత పత్రిక తీరుస్తుందా.. భారతీ సిమెంట్స్ తీరుస్తుందా అని నిలదీశారు. ఈ సీఎం నమ్మించి గొంతు కోసే రకమని దుయ్యబట్టారు. రాయలసీమ బిడ్డనని చెప్పుకొంటూ ఈ ప్రాంతానికి ఏమీ చేయలేదన్నారు. ఈ ప్రాంతంలో 52 అసెంబ్లీ స్థానాలుంటే గత ఎన్నికల్లో 49 మంది వైసీపీ ఎమ్మెల్యేలను గెలిపించారని.. కానీ ఒక్క పనైనా చేశాడా అని ప్రశ్నించారు. ఐదేళ్లలో ఒక్క ఇరిగేషన్ ప్రాజెక్టయినా పూర్తి చేశాడా.. కర్నూలు ప్రాంతానికి కనీసం నీళ్లు ఇవ్వాలన్న ఆలోచనైనా చేశాడా.. పేదలు, యువత భవిష్యత్ గురించి ఆలోచించాడా అని నిలదీశారు. ఆయన రాయలసీమ ద్రోహి అని.. ఒక్క ఓటు వేసినా మన నెత్తిన మనమే చెత్తవేసుకున్నట్లు అవుతుందని హెచ్చరించారు. బటన్ నొక్కి ప్రజల సంక్షేమమని ప్రతిరోజూ చెబుతున్నాడని.. అలాగైతే మద్య నిషేధం, జాబ్ కేలెండర్, డీఎస్సీలపై ఎందుకు నొక్కలేదని ప్రశ్నించారు. తొమ్మిదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచాడని.. ఆర్టీసీ, పెట్రోలు, డీజిల్, నిత్యావసరాల ధరలు పెరిగి జనం అల్లాడుతుంటే.. వాటిని తగ్గించే బటన్ ఎందుకు నొక్కలేదన్నారు. 'సంక్షేమం పేరుతో రూ.10 ఇచ్చి రూ.100 లాగేసుకుంటున్నాడు. బటన్ నొక్కి ఇచ్చింది ఎంత? ప్రజల నుంచి నొక్కింది ఎంత? అందులో మీరు బొక్కింది ఎంత' అని నిలదీశారు. రాష్ట్ర విభజన సమయంలో ఏపీ కన్నా తెలంగాణలో తలసరి ఆదాయం 35 శాతం అధికంగా ఉంటే 2014-19లో దానిని 27 శాతానికి తగ్గేలా చేశామని.. జగన్ వచ్చాక తేడా 45 శాతానికి పెరిగిందని.. బటన్ నొక్కి పేదల సంక్షేమం చేస్తే ఇంత వ్యత్యాసం ఎందుకొచ్చిందని ప్రశ్నించారు. ఐదేళ్లుగా రాష్ట్రాన్ని పట్టి పీడిస్తున్న శని మే 13తో విరగడైపోతుందని చెప్పారు.

ఫ్యాన్ చెత్తబుట్టలోకే..

ఈ ఎన్నికల్లో ఫ్యాన్ ముక్కలై చెత్తబుట్టలో పడేయడం ఖాయమని చంద్రబాబు అన్నారు. "ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదని, విధ్వంసకర వైసీపీ పాలన అంతం కావాలన్న ఉద్దేశంతో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి పొత్తుకు ఆద్యుడు పవన్. మూడు పార్టీలు కలవడం మాకోసం, మా రాజకీయాల కోసం కాదు. ప్రజలు గెలవాలి, ఏపీ బాగుండాలన్న ఉద్దేశంతోనే! ఈ విషయాన్ని ప్రజలంతా గుర్తించాలి. సంక్షేమంతో పాటు అభివృద్ధి చేయాలంటే కేంద్రం సహకారం అవసరం. రాష్ట్ర ప్రయోజనాల కోసమే పొత్తు పెట్టుకున్నాం. మేం కలిస్తే జగన్ ఎందుకు కంగారు పడుతున్నాడు? ముస్లింలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నాడు. ఎన్డీయే అధికారంలోకి వస్తే ముస్లిం రిజర్వేషన్లు పోతాయని రెచ్చగొడుతున్నారు" అని మండిపడ్డారు.

కూటమి విజయం ఖాయం: పవన్

- వైసీపీ దోపిడీని అరికడితే అన్ని పథకాలకు నిధులు వస్తాయి
- పింఛన్లు అందేలా చూడండి.. 3 పార్టీల నేతలకు జనసేనాని పిలుపు



పిఠాపురం, మార్చి 31: రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో విజయం సాధించి రాబోయేది జనసేన-టీడీపీ-బీజేపీ కూటమి ప్రభుత్వమేనని జనసేన అధినేత పవన్ కల్యాణ్ పునరుద్ఘాటించారు. భారీ మెజారిటీతో సీట్లు గెలవబోతున్నామని తెలిపారు. ప్రస్తుతం అమలు చేస్తున్న ఏ సంక్షేమ పథకం ఆగిపోదని.. ఈ విషయాన్ని స్పష్టంగా అందరికీ తెలియజేయాలని మూడు పార్టీల నేతలకు పిలుపిచ్చారు. ఆదివారం కాకినాడ జిల్లా పిఠాపురం మండలం కుమారపురం గోకులం గ్రాండ్‌లో ఆదివారం పిఠాపురం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవం, ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసి సైబరాబాద్ వంటి ప్రత్యేక నగరాన్ని తయారు చేసిన అనుభవజ్ఞుడు, టీడీపీ అధినేత చంద్రబాబును జగన్ ప్రభుత్వం అకారణంగా, కక్షపూరితంగా జైలులో పెట్టినప్పుడు బాధేసిందని జనసేనాని పవన్ కల్యాణ్ అన్నారు. రాజమహేంద్రవరం వెళ్తున్నప్పుడు దారిపొడవునా టీడీపీ కార్యకర్తలు తమ నాయకుడి కోసం పడిన తపన తనను కదిలించిందని, అందుకే సెంట్రల్ జైలులో చంద్రబాబును కలిశాక తన వంతుగా ఏదైనా చేయాలని భావించి కచ్చితంగా వచ్చే ఎన్నికల్లో రెండు పార్టీలు కలిసి వెళ్తాయని ప్రకటించానని ఆయన తెలిపారు. అప్పుడు తాను చెప్పినట్లుగానే బీజేపీ తమతో కలిసి వచ్చిందని చెప్పారు. ఆ పార్టీ కోసం ఎంపీ సీట్లు తగ్గించుకున్నానని తెలిపారు. తాను పొత్తు కోసం ఎంత తపించానో.. మూడు పార్టీల నాయకులు గెలుపు కోసం అంతే కష్టపడాలని సూచించారు. చిన్న చిన్న ఇబ్బందులు ఉన్నా వాటిని అధిగమించి పనిచేయాలని కోరారు. 'ఇప్పుడు ఇస్తున్న పథకాల కంటే అధికంగానే సంక్షేమ ఫలాలు పంచుతాం. మద్యం, గంజాయి, ఇసుక, ల్యాండ్ మాఫియా వంటి వాటిని అరికడితే అన్ని పథకాలకు కచ్చితంగా డబ్బులు సర్దుబాటవుతాయి. వైసీపీ దోపిడీ అరికడితే అప్పులు చేయకుండానే సంక్షేమ పథకాలు అమలు చేయవచ్చు. ఎన్నికల కోడ్ వల్ల ప్రతినెలా ఒకటో తేదీన అందాల్సిన సామాజిక పింఛన్లు ఈ నెల ఆలస్యం కావచ్చు. వలంటీర్లు లేకుండా పింఛన్లు సక్రమంగా పంపిణీ చేసేందుకు మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎన్నికల నియామవళికి అనుగుణంగా అధికారులకు సహకరించాలి' అని సూచించారు.

ఉత్తరాదిపై మజ్లిస్ గురి!

- యూపీ, బిహార్‌లో ఖరారైన పొత్తులు
- వ్యూహాత్మకంగా హిందువులకూ టికెట్లు

హైదరాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు హైదరాబాద్ పాతనగరంలో.. ఎంసీహెచ్(ప్రస్తుతం జీహెచ్ఎంసీ) ఎన్నికల్లో పత్తర్‌గట్టీ డివిజన్ నుంచి విజయభేరీ మోగించిన మజ్లిస్ ఇత్తేహాదుల్ ముస్లిమీన్(ఎంఐఎం) క్రమంగా జాతీయ పార్టీగా ఎదుగుతోంది. ఈ క్రమంలో బిహార్, యూపీల్లో ఓటుబ్యాంకును.. ఓట్ల శాతాన్ని పెంచుకుంటూ ముందుకు పోతోంది. ఈ క్రమంలో ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో తమకు సిటింగ్ స్థానం ఉన్న మహారాష్ట్రతో పాటు.. యూపీ, బిహార్‌పై ప్రత్యేకంగా దృష్టిసారించింది. "మేము బీజేపీకి వ్యతిరేకం. అలాగని కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమికి మద్దతు కాదు. ఇండియా కూటమి కేవలం ఎన్నికల అవసరాలకే పరిమితం. మైనారిటీ, బడుగు వర్గాల అభ్యున్నతికి మేం పనిచేస్తాం" అని మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ స్పష్టం చేశారు. యూపీలో డాక్టర్ పల్లవి పటేల్ నాయకత్వంలోని అప్నాదళ్(కామెరవాడి)తో కలిసి పోటీ చేస్తామని ఆదివారం ఆయన ప్రకటించారు. ప్రగతిశీల మానవ్ సమాజ్ పార్టీ, రాష్ట్రీయ ఉదయ్ పార్టీతోనూ పొత్తు ఉంటుందని, బిహార్‌లోనూ ఎన్డీయే-ఇండియా కూటముల్లో లేని పార్టీలను కలుపుకొనిపోతున్నట్లు వివరించారు. ఉత్తరప్రదేశ్‌లో ఏడు, బిహార్‌లో 11 స్థానాల్లో పోటీ చేస్తున్నట్లు తెలిపారు. బిహార్‌లో ఐదు చోట్ల హిందువులకు మజ్లిస్ టికెట్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. మహారాష్ట్రలో గతంలో ఎంవీఏతో కలిసి పోటీ చేసిన మజ్లిస్.. ఈ సారి ఒంటరిగా వెళ్తోంది. తమ పార్టీ ఔరంగాబాద్ సిటింగ్ ఎంపీ ఇంతియాజ్ జలీల్ అదేస్థానంలో పోటీ చేయనుండగా.. మైనారిటీల బలం ఎక్కువగా ఉన్న మరో నాలుగు చోట్ల మజ్లిస్ బరిలోకి దిగనున్నట్లు తెలుస్తోంది. కర్ణాటకలో సమీకరణాలు అనుకూలంగా లేనందున పోటీ చేయడం లేదని మజ్లిస్ వర్గాలు తెలిపాయి.


రంజిత్‌రెడ్డిని కలిసిన శంషాబాద్ నాయకులు

రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తాం

చేవెళ్ల, మార్చి 31 : లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని ఆ పార్టీ మండలాధ్యక్షుడు గడ్డం శేఖర్‌యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం రంజిత్‌రెడ్డిని వందలాది మంది కార్యకర్తలతో శంషాబాద్‌లో కలిసి శాలువాతో సత్కరించారు. శేఖర్ యాదవ్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో శంషాబాద్ మండలం నుంచి అత్యధిక మెజార్టీ ఇస్తామని రంజిత్ రెడ్డికి హామీ ఇచ్చారు. రంజిత్ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి అత్యధిక మెజారిటీ ఇవ్వాలన్నారు. నర్కూడ ఎంపీటీసీ గౌతమిఅశోక్, మండల ఉపాధ్యక్షుడు రమేష్, కుమార్, సుకుమార్, ప్రవీణ్‌యాదవ్, లింగమయ్య, గణేష్‌నాయక్, రవినాయక్, శ్రీను నాయక్, రఘు, శ్రీనివాస్‌యాదవ్, లింగంగౌడ్, దేవేందర్, శ్రీరాములు, రాకేష్, వెంకట్‌రెడ్డి, మహేశ్ తదితరులున్నారు.

నర్సింహారెడ్డిని కలిసిన నాయకులు



కందుకూరు, మార్చి 31 : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల స్టేట్ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించిన చల్లా నర్సింహారెడ్డిని ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి విస్లావత్ ఆంజనేయులు నాయక్ మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఆ పార్టీ మండల కో-ఆర్డినేటర్ ఎండీ అఫ్జల్ బేగ్‌తో కలిసి నగరంలోని చల్లా నివాసానికి వెళ్లి సన్మానించారు. నర్సింహారెడ్డి మాట్లాడుతూ కష్టపడి పనిచేసే కార్యకర్తలు, నాయకులకు కాంగ్రెస్ పార్టీ తగిన గుర్తింపునిస్తుందన్నారు. ఆ పార్టీ నేతలు కేతావత్ మోహన్, నాయక్, పాత్లావత్ జానియా, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'ఈస్టర్'



ప్రత్యేక ప్రార్థనలు చేసిన క్రైస్తవులు
యేసుక్రీస్తు పునరుత్థానం వివరించిన పాస్టర్

కడ్తాల్, మార్చి 31 : మండల కేంద్రంలో ఆదివారం ఈస్టర్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక యెహోవా నిస్సీ మినిస్ట్రీస్ మందిరంలో నిర్వహించిన వేడుకల్లో క్రైస్తవులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రీస్తు పునరుత్థానం గురించి పాస్టర్ సఫియా నవాబు పాషా వివరించారు. యేసుక్రీస్తు బోధనలు సమస్త మానవాళికి అనుసరణీయమని ఆయన పేర్కొన్నారు. యేసు క్రీస్తు లోకరక్షకుడని, సృష్టి కారణభూతుడని అన్నారు. మానవత్వం, శాంతి, కరుణతో జన హృదయాల్లో శాశ్వతంగా నిలిచిన వ్యక్తి యేసు భగవానుడని కొనియాడారు. దయ, సేవాభావం, మానవత్వాలను ప్రబోధించిన యేసుక్రీస్తు సందేశాలు అందరికీ మార్గదర్శకమని పేర్కొన్నారు.

ఈస్టర్ వేడుకల్లో క్రైస్తవులు

ప్రజాపాలనకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరిక

● కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జి కేఎల్లార్

మహేశ్వరం, మార్చి 31 : ప్రజాపాలనకు ఆకర్షితులై ఇతర పార్టీలకు చెందినవారు కాంగ్రెస్‌లో చేరుతున్నారని, మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు లోక్‌సభ ఎన్నికల్లో విజయఢంకా మోగించాలని మాజీ ఎమ్మెల్యే, పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్లార్) అన్నారు. ఆదివారం మహేశ్వరం నియోజకవర్గంలోని ఆర్కే. పురం, తుక్కుగూడ మున్సిపాలిటీతో పాటు వివిధ గ్రామాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు తుక్కుగూడలోని పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ త్వరలో అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలు వేసి ప్రభుత్వ పథకాలను అర్హులందరికీ చేరవేయడంలో కీలక బాధ్యతలు కమిటీ సభ్యులకే అప్పగించనున్నట్లు తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని, నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, మధుసూదన్, సైదులు, మహేందర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


బీఆర్ఎస్ నాయకులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి

చేవెళ్లలో రంజిత్‌రెడ్డి ఘనవిజయం ఖాయం

ఎల్బీనగర్ : చేవెళ్ల ఎంపీగా రంజిత్‌రెడ్డి ఘనవిజయం సాధించడం ఖాయమని కిచ్చెనగారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆర్‌కేపురం డివిజన్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కేఎల్ఆర్, టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డిల సమక్షంలో అల్కాపురిలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బీజేపీ దోపిడీ పాలనతో ప్రజలు విసిగిపోయారని, ఎప్పుడు ఎన్నికలు జరిగినా చేవెళ్లతో పాటు దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌ను గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఆర్‌కేపురం డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు లింగస్వామిగౌడ్, శ్రీనివాసులు, పగడాల ఎల్లయ్య, శ్యాంసుందర్‌గౌడ్, యాదవరెడ్డి, శ్రీనివాసులు, రమేష్, మధుయాదవ్, శంకర్, సుజాతరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, కృష్ణారావు, అంజరావ్, స్వామిగౌడ్, సాయితేజరెడ్డి, పురుషరాజ్ తదితరులు కాంగ్రెస్‌లో చేశారు. వారికి కేఎల్లార్, దేప భాస్కర్‌రెడ్డిలు కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీ ఆర్‌కే పురం డివిజన్ అధ్యక్షుడు పున్న గణేష్‌నేత, రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు ఉపేందర్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, బండి మధుసూదన్‌రావు, మహేందర్, రవీంద్ర, సురేష్, కాళిదాస్, సైదులు, శ్రీకాంత్‌రెడ్డి, విప్లవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మల్లికార్జునస్వామి కల్యాణం



మహేశ్వరం/కందుకూరు : మల్లికార్జునస్వామి కల్యాణంలో ఎమ్మెల్యే సబితారెడ్డి; పూజల్లో పాల్గొన్న జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి

మహేశ్వరం, మార్చి 31 : మండల పరిధిలోని సుభాన్‌పూర్ గ్రామంలో మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి, రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ అనితాహరినాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డిలతో పాటు వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, గ్రామ మాజీ సర్పంచ్ గుత్తి పద్మపాండు తదితరులు పాల్గొన్నారు

ఘనంగా ఈదమ్మ ఆలయ వార్షికోత్సవం

కందుకూరు : మండలంలోని దెబ్బడగూడ గ్రామంలో ఈదమ్మ ఆలయం మూడో వార్షికోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారు జాము నుంచి మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆ గ్రామ మాజీ సర్పంచ్‌లు ఏనుగు శ్రావణి, జంగయ్య, స్థానిక ఎంపీటీసీ ఎల్మటి లక్ష్మి, మాజీ జడ్పీటీసీ ఏనుగు జంగారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం నిర్వహించిన అమ్మవారి కల్యాణానికి నాయకులు డి.శ్రీనివాస్, వి.యాదగిరి, డి.నర్సింహ, వి.రాజు, డి.ఆంజనేయులు, డి.రామకృష్ణ, తదితరులున్నారు. అంతకు ముందు అమ్మవారికి జీవాలను బలిచ్చారు.

కొల్కులపల్లిలో బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు

మాడ్గుల : మండలంలోని కొల్కులపల్లి గ్రామంలో ఆదివారం బొడ్రాయి ద్వితీయ ప్రతిష్ఠాపనోత్సవాలు ఎంపీటీసీ బట్టు కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామదేవతలకు నీటితో అభిషేకం చేశారు. బొడ్రాయి వద్ద బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ సర్పంచ్ భట్టు అనురాధ కిషన్‌రెడ్డి, నర్సింహరెడ్డి, భూపతిరెడ్డి, జంగయ్య, సాయిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


తలకొండపల్లి : అశ్వవాహన సేవలో పాల్గొన్న భక్తులు

ముగిసిన బ్రహ్మోత్సవాలు

తలకొండపల్లి : దేవుని పడకల్ గ్రామంలో కొలువై ఉన్న శ్రీ లక్ష్మీ అలివేలు మంగ, గోదా సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా ముగిశాయి. వారం రోజులపాటు బ్రహ్మోత్సవాలు కొనసాగాయి. వివిధ ప్రాంతాల నుంచి ఉత్సవాలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. ముగింపు వేడుకల్లో భాగంగా చక్రతీర్థం, ద్వాదశ ఆరాధన, ధ్వజావరోహణం, ప్రత్యేక పూజలు, అశ్వవాహన సేవ కార్యక్రమాలు నిర్వహించారు. పూజల్లో ఆరాధకులు నడాదూర్ రామాచార్యులు, పరవస్తు గోపాలాచార్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గణపతి హోమం

ఆమనగల్లు, మార్చి 31 : మండలంలోని ఆకుతోటపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సూరమాంబ సమేత కంఠమహేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. గౌడ సంఘం ఆధ్వర్యంలో వేడుకలకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. వేడుకల్లో భాగంగా రెండోరోజు ఆదివారం అర్చకులు నవీన్ శర్మ బృందం ఆధ్వర్యంలో గణపతి పూజ, హోమం నిర్వహించారు. సోమవారం నిర్వహించే విగ్రహ ప్రతిష్ఠకు పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. వేడుకల్లో సంఘ సేవకుడు పాపిశెట్టి రాము, శ్వేత దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు వీరేశ్‌గౌడ్, శేఖర్‌గౌడ్, శ్రీనుగౌడ్, రవిగౌడ్, తిరుపతిగౌడ్, బాల్‌రాజ్ గౌడ్, కృష్ణగౌడ్, నారాయణగౌడ్, శేఖర్‌గౌడ్, నర్సింహగౌడ్, కృష్ణగౌడ్, బాలస్వామిగౌడ్, శ్రీనుగౌడ్, మహేశ్‌గౌడ్ పాల్గొన్నారు.


మాడ్గుల : బోనం తీస్తున్న ఎంపీటీసీ కిషన్‌రెడ్డి తదితరులు

మల్లన్న ఆలయ అభివృద్ధికి విరాళాలు

షాబాద్ : మండల పరిధిలోని సాయిరెడ్డిగూడ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న మల్లన్న స్వామి ఆలయానికి షాబాద్ గ్రామానికి చెందిన వ్యాపారవేత్త దండు విశ్వనాథంగుప్తా రూ. 51వేల విరాళం, ఎంపీటీసీ అశోక్ రూ.51వేల విరాళం ఆలయ కమిటీ సభ్యులకు ఆదివారం అందజేశారు.


ఆమనగల్లు : గణపతి హోమంలో భక్తులు



కసిరెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

తాగునీరు, విద్యుత్ సమస్యలు
ఉత్పన్నం కాకుండా చర్యలు

ఆమనగల్లు, మార్చి 31: వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగునీరు, విద్యుత్ సమస్యలు ఉత్పన్నం కాకుండా ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. అధికారులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించాలని ఆయన సూచించారు. ఆమనగల్లు, తలకొండపల్లి, కడ్తాల, మాడ్గుల, కల్వకుర్తి మండలాల పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు ఆదివారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి తమ తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను, అభివృద్ధి పనులకు నిధుల మంజూరు గురించి ఎమ్మెల్యేకు వినతి పత్రాలు అందజేశారు. సమస్యలను పరిష్కరిస్తామని కసిరెడ్డి హామీ ఇచ్చారు. ఏప్రిల్ 3న జిల్లెల్ల గ్రామంలో నిర్వహించే శ్రీ మల్లికార్జున స్వామి కల్యాణానికి హాజరుకావాలని స్థానికులు ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమాల్లో నాయకులు ఆనంద్‌కుమార్, రాములు, సురేందర్ రెడ్డి, గూడూరు భాస్కర్‌రెడ్డి, హన్మనాయక్, శ్రీకాంత్ రెడ్డి, కృష్ణ, నరేశ్ నాయక్, బాబా, రవీందర్, శ్రీనివాస్‌రెడ్డి, సంజీవ, విజయ్‌రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

మూడోసారి బీజేపీదే అధికారం

● పార్టీ జిల్లా కార్యదర్శి గుండన్నగారి వెంకట్‌రెడ్డి



చేవెళ్ల, మార్చి 31 : కేంద్రంలో మూడోసారి బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గుండన్న గారి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన చేవెళ్ల పట్టణ కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ కులమతాలకతీతంగా అన్ని వర్గాల ప్రజలు ప్రధాని మోదీకి మద్దతుగా నిలుస్తున్నారని చెప్పారు. మోదీ ప్రధాని అయ్యాక దేశ ప్రతిష్ఠ, గౌరవం పెరిగాయన్నారు. ప్రపంచ దేశాలన్నీ భారత్ వైపు చూస్తున్నాయన్నారు. భారత్‌కు మోదీ వంటి శక్తివంతమైన ప్రధాని అవసరమని తెలిపారు. బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్ సహా విపక్షాలన్నీ ఇండియా కూటమిగా ఏర్పడ్డాయని, ఎన్నికుట్రలు చేసినా మరోసారి బీజేపీనే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. చేవెళ్ల ఎంపీగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బీజేపీ గెలుపునకు చేవెళ్ల నుంచే నాంది పలకాలని అన్నారు.

మాల బ్యాగరి కాటికాపరుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సత్తయ్య

● రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా గాదె మల్లేష్


గాదె సత్తయ్య

కందుకూరు, మార్చి 31 : మండలంలోని కందుకూరు గ్రామానికి చెందిన గాదె సత్తయ్యను మాల బ్యాగరి కాటికాపరుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, అదే గ్రామానికి చెందిన గాదె మల్లేషను రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా, గాదె కుమార్‌ను జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించినట్లు ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు చెన్నకేశవులు ప్రకటించారు. ఆదివారం నగర శివారులో సంఘం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మరణించిన కుటుంబ సభ్యులకు తమ వంతు ఆర్థికసాయం అందజేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ సమస్యలు పరిష్కరించడంలో కాలయాపన చేస్తోందన్నారు. అన్ని గ్రామాలు, పట్టణాల్లో ప్రజలకు మరిన్ని సేవలు అందించడానికి పాలకులు చొరవ చూసే వరకు తాము చేపట్టిన నిరసనను మరింత ఉధృతం చేయనున్నట్లు వారు తెలిపారు.

నేడు చేవెళ్లలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

● పాల్గొననున్న మాజీ మంత్రి కేటీఆర్

చేవెళ్ల, మార్చి 31 : లోక్‌సభ ఎన్నికల్లో సందర్భంగా నేడు(సోమవారం) చేవెళ్ల పట్టణ కేంద్రంలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షుడు ప్రభాకర్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణ కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో ఉదయం 10 గంటలకు చేవెళ్ల నియోజకవర్గ స్థాయి కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం ఉంటుందన్నారు. కేటీఆర్, సబితారెడ్డి, కాసాని జ్ఞానేశ్వర్, తదితరులు హాజరుకానున్నారని చెప్పారు.

నేడు బూత్ కమిటీ అధ్యక్షుల సమావేశం


మాట్లాడుతున్న మానయ్య

ఆమనగల్లు, మార్చి 31 : కల్వకుర్తి నియోజకవర్గ స్థాయి బూత్ కమిటీ అధ్యక్షుల సమావేశం విజయవంతం అచ్చంపేట నియోజకవర్గ కేంద్రంలోని ఏసీఆర్ గార్డెన్‌లో సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు కాంగ్రెస్ పార్టీ ఆమనగల్లు పట్టణాధ్యక్షుడు వస్పుల మానయ్య చెప్పారు. ఆమనగల్లు పట్టణంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించడానికి ఏఐసీసీ కో-ఆర్డినేటర్ కొప్పుల రాజు, మంత్రులు కృష్ణారావు, రాజనర్సింహ, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎంపీ అభ్యర్థులు మల్లు రవి, వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యే కసిరెడ్డి, వంశీకృష్ణ, తదితరులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.


మాట్లాడుతున్న బోసుపల్లి ప్రతాప్

లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

ఆదిభట్ల, మార్చి 31 : లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యుడు బోసుపల్లి ప్రతాప్ సూచించారు. ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధి కొంగరకలాన్‌లోని కల్వకోలు లక్ష్మీదేవమ్మ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం మున్సిపల్‌కు చెందిన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆదిభట్ల మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు శిగ వీరస్వామి గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రతాప్ మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా బీజేపీ 370 స్థానాలు గెలిచేందుకు లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందన్నారు. రాష్ట్రంలో పదికిపైగా ఎంపీ స్థానాలు గెలుచుకునేందుకు కార్యకర్తలు కష్టపడి పనిచేయాలన్నారు. నర్సింహారెడ్డి, బొట్టు రమేష్, ఉడుతల అశోక్ గౌడ్, గజ్జల నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

చేవెళ్ల : శంకర్‌పల్లి మండలం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, మోకిలలో కార్పొరేట్ స్థాయి షోరూంలు పెట్టడానికి వ్యాపారస్తులు ముందుకురావడం అభినందనీయమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని మోకిల గ్రామంలో ఆదివారం ఏపీ మాజీ మంత్రి శిల్పామోహన్‌రెడ్డితో కలిసి ఓ షోరూంను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, నంద్యాల ఎమ్మెల్యే శిల్పా ప్రతాప్‌రెడ్డి, చెన్నారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు : రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రాభవం కోల్పోయిందని, లోక్‌సభ ఎన్నికల అనంతరం ఆ పార్టీ కనుమరుగు కాక తప్పదని కాంగ్రెస్ జిల్లా నాయకుడు, ఆమనగల్లు మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు అన్నారు. అభివృద్ధిని కాంక్షించి పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలంతా కాంగ్రెస్‌తో కలిసి రావాలని పిలుపు నిచ్చారు. ఆమనగల్లు పట్టణంలో ఆదివారం కాంగ్రెస్ జిల్లా నాయకుడు రవీందర్ నాయక్, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పులికంటి మైసయ్యలతో కలిసి విలేకరుల సమావేశంలో గుర్రం కేశవులు మాట్లాడారు.

తలకొండపల్లి : మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణను ప్రతీ పౌరుడు సామాజిక బాధ్యతగా గుర్తించాలని టీఎస్ఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ అన్నారు. భావితరాల మనుగడను దృష్టిలో ఉంచుకొని మొక్కల పెంపకం ఉద్యమ స్ఫూర్తితో చేపట్టి సంరక్షించాలని ఆయన కోరారు. టీఎస్ఎస్‌వో ఆధ్వర్యంలో మన్నెంకొండలో ఆదివారం మొక్కల పెంపకం కార్యక్రమాన్ని చేపట్టారు.

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

చేవెళ్ల, మార్చి 31 : అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన చేవెళ్ల మండల కేంద్రంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై ప్రదీప్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తూర్ మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ గ్రామానికి చెందిన అబ్దుల్ షేక్ మహమ్మద్(55) భార్య చనిపోవడంతో దర్గా వద్ద బిక్షాటన చేసేవాడు. అదే గ్రామానికి చెందిన బీబీ బేగం, రజియా బేగం నగరంలోని జియాగూడకు చెందిన ఖాదర్‌లు ఎక్కడ జాతర జరిగినా.. అక్కడికి వెళ్లి బెలూన్స్ అమ్ముతూ జీవనం సాగించేవారు. షాద్‌నగర్‌లోని దర్గా వద్ద జరిగిన జాతరలో అబ్దుల్ షేక్ మహమ్మద్‌కు ఖాదర్ పరిచయమయ్యాడు. వీరంతా కలిసి మహా శివరాత్రి సందర్భంగా చేవెళ్లలో జరిగే జాతరకు వచ్చారు. సీపీఐ కాలనీలో గదిని అద్దెకు తీసుకొని అక్కడే ఉంటూ.. బెలూన్స్ ఇతర సామగ్రి అమ్ముకుంటూ ఉన్నారు. శనివారం సాయంత్రం అబ్దుల్ షేక్ మద్యం సేవించి గదికి వచ్చి పాన్ తింటుండగా ఆయాసం రావడంతో స్పృహ కోల్పోయి కిందపడి పోయినట్లు పోలీసులు తెలిపారు. శరీరంపై గాయాలు లేకపోవడంతో పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి కుమారుడు రహీం ఫిర్యాదు మేరకు అనుమానాస్పద కేసుగా నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నందిగామ మండలం నర్సప్పగూడలో మరొకరు..

షాద్‌నగర్, మార్చి 31: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందిన ఘటన మండల పరిధిలోని నర్సప్పగూడలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సప్పగూడ గ్రామానికి చెందిన జంగిలి భిక్షపతి(46) మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో ఆదివారం పూటుగా మద్యం సేవించి ఇంట్లో పడుకున్నాడు. అనంతరం మంచంపై నుంచి కిందపడ్డాడు. కుటుంబసభ్యులు చూసేసరికి అప్పటికే మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. భిక్షపతి మృతిపై అనుమానాలున్నాయని తమ్ముడు జయ్‌రాజ్ నందిగామ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ చెప్పారు.

ఆటోను ఢీకొన్న డీసీఎం
ముగ్గురు కార్మికులకు గాయాలు

చేవెళ్ల, మార్చి 31 : శంషాబాద్ మున్సిపల్ కేంద్రం సమీపంలో డీసీఎం వ్యాన్ అదుపుతప్పి ఆటోను ఢీకొంది. దాంతో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు కార్మికులకు గాయాలు కాగా.. ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కిషన్‌గూడ నుంచి శంషాబాద్ వైపుకు వెళ్తున్న డీసీఎం వ్యాను అదుపు తప్పి ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొంది. ఆటోలో ఉన్న ముగ్గురు కార్మికులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

బోరు మోటార్ల సర్వీస్ వైర్లు అపహరణ

యాచారం, మార్చి 31 : హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆకులమైలారం గ్రామంలో శనివారం అర్ధరాత్రి వ్యవసాయ బోరుమోటార్ల సర్వీస్ వైర్లను అపహరించిన ఘటన వెలుగుచూసింది. కాగా, దుండగుడు బైక్‌ను ఓ చోట ఆపి సర్వీస్ వైర్ కట్ చేస్తుండగా అక్కడ వారిని గమనించిన రైతు.. వారి బైక్‌ను సెల్‌ఫోన్‌లో ఫొటో తీశాడు. ఆకులమైలారం గ్రామంలో శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగుడు.. అచ్చన భద్రయ్య, కోరె బీరప్ప, లడే బీరప్ప, గొరిగె బీరప్పతో పాటు ఇతర రైతులకు చెందిన బోరుబావుల వద్ద ఫీజులు తీసి సర్వీస్ వైర్లను అపహరించుకెళ్లాడు. దొంగ తన బైక్‌ను పంట పొలం వద్ద ఆపి తన పని చేస్తుండగా.. ఓ రైతు బైక్‌ను ఫొటో తీశాడు. బైక్ నంబర్ టీఎస్ 08 ఈవి4454 అని రాసి ఉంది. అయితే, ఆ బైక్‌పైనే దొంగ సర్వీస్ వైర్ల అపహరణకు వచ్చినట్లు రైతులు అనుమానిస్తున్నారు. ఆదివారం బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నేటి నుంచి ధాన్యం కొనుగోళ్లు

షాద్‌నగర్‌అర్బన్, మార్చి 31: షాద్‌నగర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో నేటి(సోమవారం) నుంచి వరి ధాన్యం కొనుగోలు చేస్తామని షాద్‌నగర్ శాఖ కార్యదర్శి రఘునందన్ తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట శివారులో నిర్మించిన పీఏసీఎస్ గోడౌన్ల వద్ద కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఏగ్రేడ్ రకం క్వింటాల్‌కు రూ.2,203, సాధారణ రకం రూ.2,183 మద్దతు ధరపై కొనుగోలు చేస్తామని, పాసుపుస్తకం, ఆధార్, బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్ వ్యవసాయశాఖ టోకెన్‌పత్రం తీసుకురావాలన్నారు.

చేవెళ్లలో బీఆర్ఎస్ జెండా ఎగరవేయాలి


పద్మారావును కలిసిన తిరుపతిరెడ్డి

మొయినాబాద్ రూరల్, మార్చి 31 : చేవెళ్ల గడ్డపై బీఆర్ఎస్ జెండాను ఎగరవేసేందుకు పార్టీ శ్రేణులు కష్టపడి పనిచేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ సూచించారు. ఆదివారం నగరంలోని ఆయన నివాసంలో మండలానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్తపల్లి తిరుపతిరెడ్డి, బద్దుల సుధాకర్ యాదవ్‌లు పద్మారావును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే పలు సూచనలు చేసినట్లు తెలిపారు. సామ ప్రభాకర్‌రెడ్డి, అంజనేయులు గౌడ్, సాలే మణికంఠ, తదితరులు ఉన్నారు.

బీజేపీ మండల ఉపాధ్యక్షుడిగా యాదయ్య యాదవ్


నియామకపత్రం అందజేస్తున్న నాయకులు

మొయినాబాద్ రూరల్, మార్చి 31 : పార్టీలో నిబద్ధతతో పనిచేసే వారికి గుర్తింపు లభిస్తుందని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బంటు జ్ఞానేశ్వర్ తెలిపారు. మొయినాబాద్ మండలం మూర్తుజగూడ గ్రామానికి చెందిన పాలమాకుల యాదయ్య యాదవ్ బీజేపీ మండల ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. పార్టీ నేతలు ఆయనకు అజీజ్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో నియామకపత్రాన్ని అందజేశారు. జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ చేవెళ్లలో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపుకోసం అందరూ కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. తనపై నమ్మకంతో మండల ఉపాధ్యక్షునిగా బాధ్యతలు అప్పగించిన పార్టీ పెద్దలకు యాదయ్య కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి, చేవెళ్లలో కొండా గెలుపుకోసం కష్టపడి పనిచేస్తానని అన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ బట్టు రాజమల్లేష్, ప్రధాన కార్యదర్శి రాజుగౌడ్, సీనియర్ నాయకులు వివేక్, రాజు గౌడ్, తాళ్ల శ్రీనివాస్ గౌడ్, చంద్రశేఖర్, వడ్డె రమేష్, దర్శన్, విజయ్ కుమార్, రవీందర్ తదితరులు ఉన్నారు.

సమాజాభివృద్ధిలో భాగస్వాములవ్వాలి


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

చేవెళ్ల, మార్చి 31 : విలువలతో కూడిన విద్యనేర్చుకుని సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ప్రధానోపాధ్యాయుడు విశ్వనాథంగుప్తా తెలిపారు. చేవెళ్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో 1996-97 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులంతా ఆదివారం చేవెళ్ల మండల పరిధిలోని పలుగుట్ట గ్రామంలోని ఓ రిసార్ట్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పట్లో పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులు విశ్వనాథంగుప్తా, శంకరయ్య, శాంత, జ్యోతిర్మయి, శశికళ తదితర ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి ఆశీర్వాదం తీసుకున్నారు. పూర్వవిద్యార్థులు సామ రంగారెడ్డి, మల్లేశ్, మధు, రవికాంత్‌రెడ్డి, మంజుల, గోపాల్, రాంరెడ్డి, రమేశ్, హాజీ, అనంత్‌రెడ్డి, మాణిక్యప్రభు, శ్రీదేవి, మంజుల, అలివేలు, అరుంధతి, మణిల, లక్ష్మి, మాదవి, ఆనంద్, మాధవరెడ్డి, గోపీచంద్, రవిప్రకాశ్, చంద్రశేఖర్‌రెడ్డి, జావిద్, ఉస్మాన్, మోహన్‌చారి, శ్రీనివాస్‌గౌడ్, సత్యనారాయణగౌడ్, వెంకటేశ్, నాగేశ్, తదితరులు ఉన్నారు.